నారి VOICE OF WOMEN

సూర్య

# పార్లమెంటులో పాగా

## రాజ్యసభలో మహిళా బిల్లుకు మోక్షం






తరతరాల పురుషాధిక్య కబంధ హస్తాల నుండి విడిపోయి స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న తరుణమిది... 14 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు ఫలితం దక్కిన రోజిది...సంధించిన నారీభేరి. చట్టసభలలో ఇకపై వినిపిస్తుంది తమ వాణి. 60 సంవత్సరాల షష్టిపూర్తి స్వాతంత్ర్యానికి లభించిన కానుక ఇది. ఆకాశంలో సగం అన్ని అవకాశాలనూ అందిపుచ్చుకుంటున్న తరుణంలో రాజకీయంగా కూడా అవకాశాన్ని కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లు పెద్దల సభలో ఆమోదం పొందడం యావత్ నారీ లోకాన్నీ హర్షాతిరేకంలో ముంచెత్తింది. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటన్నింటినీ అధిగమించి బిల్లు ఆమోదం పొందడం ఒక చారిత్రక ఘట్టం..

బిల్లులో ఉపకోటా డిమాండ్ చేస్తున్న వారికి ఇది కొంత నిరాశ కల్పించినప్పటికీ తదుపరి అంకాలలో ఈ బిల్లు సామాజిక న్యాయం దిశగా అడుగులు వేయగలదని ఆశించవచ్చు. పంచాయితీ రాజ్ సంస్థలలో 33 శాతం రిజర్వేషన్ల అమలుతో మహిళలు రాజకీయ సాధికారత దిశగా వేసిన తొలి అడుగులు ఇప్పుడు వేగం పుంజుకొనే అవకాశం అ బిల్లుతో కలుగనున్నది. వారు వేసిన తొలి అడుగులు గ్రామ స్థాయిలో ఏ మేరకు ప్రభావాన్ని చూపాయో ఎన్నో దృష్టాంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారు రాష్ట్ర, జాతీయ చట్ట సభలలో చూపబోయే ప్రభావం దేశ దిశనే మార్చివేయగలదని ఆశిద్దాం. తల్లిగా, భార్యగా కుటుంబ భారాన్ని, బాధ్యత ను మోసే మహిళకు దేశానికి దిశా నిర్దేశం చేయడం పెద్ద కష్టం కాదు. ఈ బిల్లు మహిళపై అత్యాచారాలను, అన్యాయాలను తొలగించడానికి తోడ్పడాలని ఆశిద్దాం.



### వంద వసంతాల కానుక



సుదీర్ఘ పోరాటాల తర్వాత 14 సంవత్సరాల అనంతరం కార్యరూపం దాల్చిన మహిళా బిల్లుకు హార్ధిక స్వాగతం. తరతరాల అణచివేత ధోరణికి స్వస్తిపలుకుతూ వంద వసంతాల మహిళా దినోత్సవ కానుకగా, సోనియాజీ అకుంఠిత దీక్షతో చేసిన కృషికి దక్కిన సంపూర్ణ ఫలితమే ఈ మహిళా సాధికారిత బిల్లు. ఇకపై రాజకీయాలలో వినూత్న మార్పులు కనిపించి ప్రక్షాళన దిశగా పయనం సాగుతుంది. దివంగత వైఎస్ కన్న కలలకు నేడు సారూప్యత లభించింది. ప్రతి మారుమూల కుగ్రామంలో నివసించే స్త్రీ లందరూ విద్యవంతులై మహిళా బిల్లు అవశ్యకతను గుర్తించిన నాడు నిజమైన ప్రజాస్వామ్యానికి పరమార్థం.

**– సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర హోంమంత్రి**

### సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు



భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 60 ఏళ్లు దాటినా ఒక మహిళకు సంపూర్ణ స్వరాజ్యం దక్కిన రోజు ఇదే. సోనియాగాంధీ కృషి, పట్టుదలతో నాడు ప్రథమ రాష్ట్రపతిగా ఒక మహిళను, లోక్‌సభ ప్రథమ స్పీకర్‌గా మరో మహిళను నియమించడంతోనే ఆమె నిబద్ధత బయటపడింది. ఈ మహిళ బిల్లుకు మోక్షం లభించిందంటే దాని వెనక ఉన్న సోనియా శక్తిని తక్కువ అంచనా వేయలేము. విపక్షల కుయుక్తులను తిప్పికొట్టి దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజుగా ఈ దినాన్ని ప్రతి మహిళ చిరస్థాయిగా గుర్తుంచుకోవాలి.

**– జె. గీతారెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి**

### చట్టసభల్లో మరిన్ని అవకాశాలు



మహిళ బిల్లు ఆమోదం పొందడం హర్షనీయం. సోనియాగాంధీ చిత్తశుద్ధితో చేసిన కృషి ఫలితమే బిల్లు ఆమోదం పొందడానికి కారణమైంది. దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న ముగ్గురు మహిళలు మహిళ బిల్లు రావాలన్న సంకల్పం మేరకు పనిచేశారు. 100వ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంలో బిల్లు ఆమోదం పొందడం సంతోషదాయకం. దీనివల్ల మరికొంతమంది మహిళలకు చట్టసభల్లో అవకాశాలు లభిస్తాయి. రాజకీయంగా బిల్లు వల్ల అనేక ఉపయోగాలు ఉంటాయని ఆశిస్తున్నాము. ఇది మహిళలకు మరిచిపోలేని పర్వదినం.

**–డి.కె అరుణ, రాష్ట్రమంత్రి.**

### సాధికారత సాధిస్తారు



14 సంవత్సరాల అరణ్యవాసం తరువాత మహిళ బిల్లు పట్టాభిషేకం చేసుకోవడం ఆనందకరం. అయితే మహిళా దినోత్సవం రోజున బిల్లు ఆమోదం పొందితే బాగుండేది. ఇది చరిత్రలో నిలిసిపోయేది. కాని దాన్ని అమలు కాకుండా అడ్డుకోవడం చాలా విచారకరం. ప్రస్తుతం రాజ్యాంగం కలిపిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు మరింతగా ఎదుగుతారు. సాధికారత దిశగా పయనిస్తారని ఆశిస్తున్నాను.

**– రోజా, మహిళా నాయకురాలు, సినిమానటి**

### ఇది మహిళా విజయం



ఇంతకాలానికి మహిళలకు మంచిరోజులు వచ్చినట్లయింది. ప్రత్యేకంగా ఇది మహిళా విజయం. ఈ విషయంలో యూపీఏ ప్రభుత్వం చేసిన కృషికి అభినందనలు తెలుపుకుంటున్నాను. అయితే వెనకబడిన కులాలకు చెందిన మహిళలకు కూడా ఈ విషయంలో న్యాయం జరిగేలా తదుపరి ఉద్యమించాలి. వారసత్వపు రాజకీయాలకు స్వస్తిపలుకుతూ ప్రతిభ ఉన్న ప్రతి మహిళా రాజకీయంగా పైకి ఎదగాలి. రిజర్వేషన్‌కై తదుపరి అడుగు వేయాలి. రాజ్యంగ ఫలాలు అందరికీ అందాలి. అప్పుడే బిల్లుకు సార్థకత లభించినట్లవుతుంది.

**–శోభారాణి, ప్రజారాజ్యం పార్టీ నాయకురాలు,**

### స్వచ్ఛమైన రాజకీయాలు రావాలి



ఇప్పుడు కాకపోతే మరెప్పటికీ సాధించుకునేవాళ్లం కాదేమో అని భయం వేసింది. మహిళా దినోత్సవం రోజున కొన్ని స్వార్థపరశక్తులు అడ్డుపడటం ప్రజలంతా చూస్తూనే ఉన్నారు. నాకు స్వతహాగా లాలూ ప్రసాద్ యాదవ్ అంటే ఎంతో అభిమానం. ప్రజల కోసం సంస్కరణలు చేయడంలో, తన భార్యను ముఖ్యమంత్రి హోదాలో కూర్చుండబెట్టి నిరాడంబర జీవితాన్ని గడిపే లాలూ లాంటి రాజకీయవేత్తలు కూడా ఈ బిల్లు ఆమోదం కాకుండా అడ్డుకోవడం బాధాకరం. దీనికి వెనక మాయావతి పాత్రను కూడా ఖండిస్తున్నాను. మాతృస్వామ్య, పితృస్వామ్య వారసత్వ రాజకీయాలకు స్వస్తిపలకాలి. మహిళలు సొంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

**–ఉషారాణి, సన్నిహిత ఉమెన్స్ సొసైటీ**



14 సంవత్సరాల తర్వాత మహిళా చట్టం ఆమోదానికి నోచుకోవడం హర్షించదగిన పరిణామం. అయితే ఇందులో ఉండే మంచి చెడ్డలను పక్కకుపెట్టి మహిళలంతా మహోద్యమంలా రిజర్వేషన్‌లపై భవిష్యత్‌లో ఉద్యమించాలి. ఇతర బిల్లుల విషయంలో కూడా మహిళలు ఇకముందు ముక్తకంఠంతో స్పందించాలి. మళ్లీ ఒక మహిళ ప్రధాని కావాలి. ఇవాళ ఉదయం నుంచి కూడా ఈ బిల్లు ఆమోదం పొందుతుంతా లేదా అని టీవీలకు అతుక్కుని మరీ చూశాను. ఈ విజయాన్ని ఏ విధంగా జరుపుకున్నా తక్కువే అవుతుంది. ఒక వారం ముందరే ఉగాది పండగ జరుపుకున్నట్లుగా ఉంది. మహిళా బిల్లు రాగానే సరిపోదు దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

**–బి. వనిత, న్యాయవాది, బీజేపీ**

### అధికారం మాదే...



బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన కొత్తగా ఏదో వస్తుందని నేను అనుకోవడం లేదు. ఆడవాళ్లను ప్రజాప్రతినిధులను చేయడం ద్వారా మగవాళ్లు అధికారం చెలాయించాలని చూస్తే బిల్లు ఉన్నా లేనట్లే. మహిళలకు సమాన వాటా అన్ని రంగాలలో కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మొత్తం మీద ఇది మహిళల విజయంగా భావించవచ్చు. 14 సంవత్సరాల తర్వాత మహిళా బిల్లు కు మోక్షం లభించడం ఆనందంగా ఉంది. అయితే దీన్ని అన్ని వర్గాల ప్రజలు స్వీకరించాలి. బిల్లు పాస్ అయ్యిందంటే మహిళల మీద మరింత బాధ్యత పెరిగినట్లు గుర్తించాలి.

**జ్యోతి, ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు**

### గర్వంగా చెప్పుకునే రోజు



ఈ రోజు భారతదేశ చరిత్రలో ఎంతో సుదినం. 33 శాతం రిజర్వేషన్‌తో మహిళలు సాధించిన సమష్టి విజయం. ప్రత్యేకించి ఈ విషయంలో యూపీఏ ప్రభుత్వానికి, సారథ్యం వహించిన సోనియాగాంధీకి, బిల్లును సమర్థించిన బీజేపీ, టీడీపీ పార్టీలకు సంబంధిత నాయకులకు మహిళల తరపున ధన్యవాదములు. పార్లమెంట్‌లో మా పార్టీ సభ్యులు కూడా దీనిని ఆమోదింపజేయడం మాకెంతో గర్వకారణం. ముఖ్యంగా ఒక మహిళగా తన శాయశక్తులా కృషిచేసిన సోనియాగాంధీకి ఈ విషయంలో అభినందనలు తెలియజేస్తున్నాను. ఇది యావత్ భారతదేశంలో మహిళలంతా తలెత్తుకుని గర్వంగా చెప్పుకునే రోజు.

**–నన్నపనేని రాజకుమారి, టీడీపీ**

### ఆనందకరం



రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించినంత మాత్రాన కొత్తగా ఒనగూరుతుందని నేను అనుకోవడం లేదు. అనేక సంవత్సరాలుగా మహిళలు సాగించిన సుదీర్ఘ పోరాట ఫలితమే మహిళా బిల్లు . అనేక అవాంతరాలను దాటుకుని బిల్లు రాజ్యాసభలో ఆమోదింపజేసుకోవడం సంతోషకరమైన విషయం

**– సీతక్క, ఎమ్మెల్యే, ములుగు, వరంగల్.**

### చారిత్రక విజయం



మహిళా దినోత్సవం రోజున మహిళా బిల్లును ఆమోదింపజేసుకుంటే అది చరిత్రలో నిలిచిపోయే అవకాశం ఉండేది. కానీ కొంతమంది రాజకీయ నాయకుల కుట్ర మూలంగా బిల్లు ఆమోదం పొందలేకపోవడం విచారకరం. ఎట్టకేలకు ఎలాంటి చర్చ లేకుండా బిల్లుకు ఆమోదం లభించిందంటే ఇది మహిళా విజయంగా భావిస్తున్నాము. అయితే బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన లాభం లేదు. రాజ్యాంగం కల్పించిన ఈ అవకాశాన్ని మహిళ మణులు సద్వినియోగం చేసుకున్నపుడే దానికి సార్థకత ఉంటుంది.

**–కవిత, తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, సినిమా నటి.**

### ఇది మహిళా దినోత్సవ కానుక



వంద సంవత్సరాల మహిళా దినోత్సవ కానుక ఇది. బిల్లు రాకుండా చేయడానికి కొందరు సైంధవులులా అడ్డుపడటం శోచనీయం. దేశ తొలి స్పీకర్‌గా, తొలి రాష్ట్రపతిగా మహిళలనే నిలబెట్టిన సోనియా గాంధీకి ధన్యవాదాలు. రాజారామ్మోహన్‌రాయ్‌లా యూపీఏ చైర్‌పర్సన్ మహిళా చట్టం అమలుకావడానికి కృషిచేయడం వెనక ఆమె కృషి, పట్టుదలే కారణం. ఆమెకు మహిళలంతా ఏమిచ్చినా తక్కువే అవుతుంది. ఇవాళ కనుక బిల్లు కోసం పట్టుబట్టక పోతే జీవితకాలం పోరాడినా ఫలితం ఉండేదికాదు.

**కాట్రగడ్డ ప్రసూన, మాజీ ఎమ్మెల్యే.**

### హర్షణీయం



చిత్తశుద్ధితో మహిళలంతా ఒక్కటై ఈ బిల్లును ఆమోదింపజేసుకోవడం హర్షణీయం. ఈ బిల్లుకు అడ్డుపడిన నాయకులు, పార్టీలను ప్రజలంతా గమనిస్తూనేవున్నారు. రాబోయే ఎన్నికలలో ఎవరైతే మహిళా బిల్లుకు మద్దతునిచ్చారో వారినే ప్రజలు గెలిపిస్తారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా చివరకు ఆమోదముద్ర వేయించుకోవడం హర్షించదగిన పరిణామం. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి ఈ విషయంలో కృతజ్ఞతలు. ఈ బిల్లు ఆవశ్యకతను ప్రతి మహిళ గుర్తుంచుకుని రాజకీయ ప్రక్షాళన మొదలెట్టాలి, ఆడవారు వంటింటికి, వంట గదికి పరిమితం కాకుండా వరుస విజయాలను సాధిస్తామని చాటిచెప్పేందుకు ఇది నాంది కావాలి.

**–శోభానాగిరెడ్డి, పీఆర్‌పీ ఎమ్మెల్యే.**

### సద్వినియోగం చేసుకోవాలి



మహిళా బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన మహిళల సమస్యలు పరిష్కారం అవుతాయనుకోవడం సరికాదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే వినియోగం అయినట్లు. బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవడం అంత మూర్ఖత్వం మరొకటిలేదు. రాజకీయాల్లో రిజర్వేషన్ అవకాశాలు పెరగడం వల్ల మహిళలకు కొత్తగా ఏదో వస్తుందని నేను ఆశించడం లేదు. అత్యాచారాలు, లైంగికవేధింపులు పెరిగాయే తప్ప తగ్గలేదు. సమాజంలో సగం భాగం ఉన్నామన్నట్లే కానీ వాటా ఎంత అనేది తేల్చుకోలేదని పరిస్థితి. దేశ పురోభివృద్ధిలో మహిళలకు సమాన వాటా దక్కినపుడే నిజమైన మహిళా దినోత్సవం. మహిళా బిల్లు ఆమోదం పొందడంతో పాటు అన్ని రాజకీయ పార్టీలు కూడా రిజర్వేషన్ విధానాన్ని సక్రమంగా అమలు చేసినప్పుడే బిల్లుకు ఉపయోగం ఉంటుంది. అప్పుడే నిజమైన సాధికారత సాధించినట్లు అనే విషయాన్ని గుర్తించాలి.

**–సంధ్య, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు**

### ఆమోదయోగ్యం కాదు



మహిళా బిల్లును ఇప్పుడున్న రీతిలో యథాతథంగా ఆమోదిస్తామంటే మేము అంగీకరించం. ప్రత్యేకంగా బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాల్సిందే. 33 శాతాన్ని 50 శాతానికి పెంచి బీసీ, ఓబీసీ ఇతర వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సమాన న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలన్న రాజ్యంగ స్ఫూర్తికి భిన్నంగా ప్రభుత్వం వ్యవహరించడం సరి కాదు. దీనివల్ల ఉన్నత వర్గాల వారికే న్యాయం జరిగే అవకాశం ఉంది.

**–ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు**

### ఇది ప్రారంభమే



ఇది మహిళలకు ప్రారంభ విజయం మాత్రమే. అయితే మహిళల సమస్యలకు కొంతవరకూ న్యాయం జరిగినట్లే. ఇన్ని సంవత్సరాల కృషికి తగిన న్యాయం జరిగింది. మళ్లీ జరగబోయే ఎన్నికలలో మహిళలకు దీని తో పూర్తిన్యాయం జరుగుతుందని ఆశిద్దాం. మహిళలు రాజకీయంగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాలోల ఇంకా పేదరికం నిరక్షరాస్యత రాజ్యమేలుతున్నాయి. వాటన్నింటిని రూపుమాపడానికి మహిళాబిల్లు ఒక మార్గదర్శకం కావాలి. అప్పుడే మహిళాభ్యుదయం సాధ్యమవుతుంది. తరతరాల పురుషహంకారానికి ఈ మహిళా బిల్లు చెంపపెట్టు కావాలి.

**–వెంకటేశ్వరి, హైకోర్టు న్యాయవాది**

### అగ్రవర్ణాల కోసమే....



బీసీ అణగారిన మహిళలకు అన్యాయం చేయడం కోసమే ఇప్పుడున్న మహిళా బిల్లును ఆమోదించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. బిల్లు పూర్తిగా ఉన్నత వర్గాలకు ప్రాముఖ్యత నిచ్చేదిగా ఉంది. దీని వల్ల ఇన్నాళ్లు అగ్రవర్ణ పురుషుల స్థానంలో ఇప్పుడు అగ్రవర్ణ స్త్రీలు అందలం ఎక్కుతారే తప్ప బడుగులకు ఎలాంటి న్యాయం జరగదు. రిజర్వేషన్‌లో ఎబిసిడి కోటా పెట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించాలి. అప్పుడే సామాజిక న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. బిల్లులో మార్పులు తీసుకువచ్చి ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి లేనట్లయితే ఆందోళనలు తప్పవు.

**విజిఆర్‌నారగోని, ప్రజాతెలంగాణాసమితి.**

రవిశంకర్, మధుకర్ వైద్యుల
ఫీచర్స్ ప్రతినిధులు